ఒక్క రోజే 752 కరోనా కేసులు

కేరళలో 2 వేలు దాటిన యాక్టివ్ కేసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: దేశంలో కరోనా కేసులు అమాంతంగా పెరిగిపోతున్నాయి. శనివారం దేశ వ్యాప్తంగా 752 కొత్త కేసులు నమోదయ్యాయి. కరోనా వల్ల నలుగురు చనిపోయారు. ప్రస్తుతం దేశంలో 3,420 యాక్టివ్ కేసులుండగా, కేరళలో ఈ తరహా కేసుల సంఖ్య 2 వేలు దాటింది. కొత్త కేసులు న్యూఢిల్లీ, గోవా, గుజరాత్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పుదుచ్చేరి, పంజాబ్, తమిళనాడు, తెలంగాణలో నమోదయ్యాయి. క్రిస్మస్ పండగ తరుణంలో దేశంలో జేఎన్.1 వేరియంట్ వ్యాప్తి చెందడం ఆందోళన కలిగిస్తున్నది.

ప్రపంచవ్యాప్తంగా 52 శాతం పెరుగుదల

గత నెల రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా కొవిడ్ కొత్త కేసులు 52 శాతం పెరిగాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. నెల రోజుల్లో 8,50,000 కొత్త కేసులు నమోదయ్యాయని తెలిపింది. 1,18,000 మంది కొవిడ్ వల్ల దవాఖానలో చేరారని తెలిపింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టీకాలు జేఎన్.1 రకం వల్ల కలిగే ప్రాణాపాయాన్ని, తీవ్రమైన వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తున్నదని డబ్ల్యూహెచ్‌వో పేర్కొన్నది. కొవిడ్‌తో పాటు ఫ్లూ, పిల్లల్లో వచ్చే సాధారణ నిమోనియా వంటి శ్వాస కోశ వ్యాధుల తీవ్రత కూడా ఎక్కువగా ఉందని ప్రకటించింది. మాస్క్ ధరించడం, చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం, లక్షణాలు కనిపించినప్పుడు టెస్ట్ చేయించుకోవాలని ప్రజలకు సూచించింది.

పాట్నా విమానాశ్రయంలో మాస్కులు ధరించిన ప్రయాణికులు

ఆ ముగ్గురినీ చంపిందెవరు?

పూంఛ్, డిసెంబర్ 23: జమ్ము కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో గురువారం ఉగ్ర దాడి జరిగిన ప్రాంతంలో శుక్రవారం ముగ్గురు పౌరులు శవాలై కనిపించారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. మరణించిన వారి కుటుంబాలకు పరిహారం, ఒకరికి ఉద్యోగం ఇస్తామని శనివారం ప్రకటించింది. ఉగ్ర దాడి గురించి ఆర్మీ ప్రశ్నించిన ఎనిమిది మందిలో మరణించిన ముగ్గురు పౌరులు ఉన్నారు. వీరంతా తోపా పీర్ గ్రామానికి చెందినవారు. పౌరుల మరణంపై రాజకీయ పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. ఘటనపై నిష్పక్షపాత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశాయి. ఆర్మీ మొత్తం 15 మందిని ప్రశ్నించిందని.. అందులో ముగ్గురు చనిపోగా మిగతా వారంతా తీవ్ర గాయాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నారని పీడీపీ అధ్యక్షురాలు ముఫ్తీ తెలిపారు. అంతర్జాతీయ సరిహద్దు వద్ద శనివారం ఉగ్రవాదులు చేసిన చొరబాటు యత్నాన్ని భారత సైన్యం సమర్థంగా తిప్పి కొట్టింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు.

హిందీ మాట్లాడేవాళ్లు టాయ్‌లెట్ క్లీనర్లు: మారన్

చెన్నై : హిందీ మాట్లాడేవాళ్లు ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల నుంచి వచ్చి తమిళనాడులో భవన నిర్మాణం, టాయ్‌లెట్ల క్లీనింగ్ వంటి చిల్లర పనులు చేసుకుంటారని డీఎంకే నేత దయానిధి మారన్ అన్నారు. ఇంగ్లిష్ నేర్చుకున్నవారికి ఐటీలో మంచి ఉద్యోగాలు వస్తాయని, కేవలం హిందీ నేర్చుకున్నవారు రోడ్లు, మరుగుదొడ్లు శుభ్రం చేసుకుని జీవిస్తారని అన్నారు. కేవలం హిందీ మాత్రమే నేర్చుకుంటే జరిగేది ఇదేనని చెప్పారు. ఈ వీడియోను బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. 'విభజించు-పాలించు' సూత్రాన్ని మరోసారి అమలు చేయడం ప్రారంభించారని దుయ్యబట్టారు. మొదట కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఉత్తరాది ఓటర్లను అవమానించారని అన్నారు.

యూపీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా ప్రియాంక తొలగింపు

- సచిన్ పైలట్‌కు ఛత్తీస్‌గఢ్ పగ్గాలు
- దీపాదాస్ మున్షీకి తెలంగాణ బాధ్యతలు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ శనివారం సంస్థాగతంగా భారీ మార్పులు చేసింది. అగ్ర నేత ప్రియాంక గాంధీని పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిస్తూ, యూపీ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించింది. రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్‌కు ఛత్తీస్‌గఢ్ సారథ్యాన్ని అప్పగించింది. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ పరిశీలకులుగా వ్యవహరించిన దీపాదాస్ మున్షీకి కేరళ, లక్షద్వీప్‌తోపాటు తెలంగాణ అదనపు బాధ్యతలు అప్పగించింది. మహారాష్ట్రకు రమేశ్ చెన్నితలను, యూపీకి అవినాష్ పాండేను, కర్ణాటకకు రణదీప్ సింగ్ సుర్జేవాలాను పార్టీ ఇన్‌ఛార్జిలుగా నియమించింది.

హిజాబ్‌పై సిద్ధరామయ్య యూటర్న్

బెంగళూరు, డిసెంబర్ 23: విద్యాసంస్థల్లో మహిళల హిజాబ్ ధారణపై కర్ణాటకలో నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్టు ప్రకటన చేసిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 24 గంటలు కూడా కాక ముందే దానిపై యూటర్న్ తీసుకున్నారు. ప్రస్తుతం అమలవుతున్న హిజాబ్ ధారణ నిషేధాన్ని తొలగించాలని ప్రభుత్వం యోచిస్తున్నదని, ఇంకా తొలగించలేదని, దీనిపై ఉన్నత స్థాయిలో చర్చలు జరిపిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన శనివారం ప్రకటించారు. నిషేధం ఎత్తివేత ఈ ఏడాది ఉంటుందా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఉన్నత స్థాయిలో చర్చలు అనంతరమే దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

అమెరికాలో హిందూ దేవాలయంపై దాడి

న్యూయార్క్, డిసెంబర్ 23: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో హిందూ దేవాలయాన్ని కొందరు దుండగులు ధ్వంసంచేశారు. భారత్‌పై వ్యతిరేకతతో ఖలిస్థానీ తీవ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్టుగా తెలుస్తున్నది. ఈ ఘటనపై అమెరికా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. నెవార్క్‌లోని శ్రీస్వామినారాయణ్ మందిరంపై శుక్రవారం ఉదయం 8.35 గంటల ప్రాంతంలో దాడి జరిగిందని పోలీసులు తెలిపారు. గోడలపై భారత వ్యతిరేక నినాదాలు రాసినట్టు చెప్పారు. ఈ దాడి ఘటనను శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత దౌత్య కార్యాలయం ఖండించింది. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది.

ఆక్స్‌ఫర్డ్, ముంబయి వర్సిటీల్లో ఆలయ నిర్వహణ కోర్సు

ముంబై: ఆక్స్‌ఫర్డ్ సెంటర్ ఫర్ హిందూ స్టడీస్‌తో కలిసి సంయుక్తంగా ఆలయ నిర్వహణ (టెంపుల్ మేనేజ్‌మెంట్) కోర్సులను ఆఫర్ చేయబోతున్నామని ముంబయి యూనివర్సిటీ ప్రకటించింది. ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని శనివారం ప్రకటించిం ది. రెండు వర్సిటీలు సంయుక్తంగా డిప్లొమా, సర్టిఫికెట్ స్థాయిలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో కోర్సులు అందజేస్తున్నట్టు తెలిపాయి. సెంటర్ ఫర్ హిందూ స్టడీస్, సంస్కృత విభాగాలు ఆక్స్‌ఫర్డ్ సెంటర్ ఫర్ హిందూ స్టడీస్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నాయని ముంబయి వర్సిటీ తెలిపింది. హిందూ తత్వశాస్త్రంపై సమగ్ర అధ్యయనానికి డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు దోహదపడతాయని తెలిపింది.

మరో 30 వేల మందిపై వేటు!

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: కృత్రిమ మేధ రంగంలో వస్తున్న మార్పులు టెకీల పాలిట శాపంగా మారింది. వేలాది మంది ఉద్యోగులను తొలగించిన గూగుల్ మరింత మందిని ఇంటికి పంపడానికి సిద్ధమవుతున్నది. యాడ్ సేల్స్ యూనిట్‌లోని 30 వేల మందికి ఉద్వాసన పలకనుంది. 2023లో గూగుల్ 12 వేల మందిని తొలగించింది. కృత్రిమ మేధ సాంకేతికత సాయంతో కొత్త యాడ్‌లను సృష్టిస్తున్నది. దీని ద్వారా తక్కువ ఖర్చుతో అత్యధిక ఆదాయం వస్తుండటమే కాక, ఉద్యోగుల సేవలు అంతగా అవసరం లేకపోవడంతో ఈ విభాగంలో ఉద్యోగాల తొలగింపునకు గూగుల్ సిద్ధమవుతున్నది.

బీఎస్ఎన్ఎల్ యూజర్ల డాటా లీక్!

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: ప్రముఖ టెలికం ఆపరేటర్ 'బీఎస్ఎన్ఎల్' ఇంటర్నెట్, ల్యాండ్‌లైన్ సేవలు పొందుతున్న వేలాదిమంది వినియోగదారుల వ్యక్తిగత, సున్నితమైన సమాచారం హ్యాకర్ చేతికి చిక్కింది. 'పెరెల్' అనే పేరుతో ఓ హ్యాకర్ సదరు వినియోగదారుల వ్యక్తిగత, గుర్తింపు వివరాల్ని 'డార్క్ వెబ్'లో అమ్మకానికి పెట్టినట్టు శనివారం మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి. వ్యక్తిగత ఈమెయిల్ అడ్రస్‌లు, కాంటాక్ట్ ఫోన్ నంబర్లు, బిల్లింగ్ వివరాలు.. మొదలైనవి హ్యాకర్ చేతికి చిక్కాయి

నౌకపై డ్రోన్ దాడి

భారత తీరంలోని అరేబియా సముద్రంలో ఘటన

- ఇజ్రాయెల్ వాణిజ్య నౌకలో మంటలు
- 20 మంది భారతీయ సిబ్బంది సురక్షితం
- అప్రమత్తమైన భారత కోస్ట్‌గార్డ్ అధికారులు
- సాయం కోసం ఐసీజీఎస్ విక్రమ్ రంగంలోకి
- క్రూడాయిల్‌తో సౌదీ అరేబియా పోర్టు నుంచి మంగళూరు వస్తున్న నౌక

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: భారత సముద్ర తీరంలో ఊహించని దాడి జరిగింది. గుజరాత్ తీర అరేబియా సముద్రంలో ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న ఓ వాణిజ్య నౌకపై శనివారం డ్రోన్ దాడి జరిగింది. నౌక దెబ్బతిన్నట్టు ఏఎఫ్‌పీ వార్తాసంస్థ తెలిపింది. దాడి సమయంలో నౌకలో 20 మంది భారతీయ సిబ్బంది ఉన్నారని, వారంతా సురక్షితంగా ఉన్నారని పేర్కొన్నది. గుజరాత్‌లోని పోరుబందర్ పోర్టు తీరానికి 217 నాటికల్ మైళ్ల దూరంలో, వెరావల్ తీరానికి నైరుతి దిశగా 200 కిలోమీటర్ల దూరంలోని అరేబియా సముద్ర ప్రాంతంలో ఎంవీ కెమ్ ప్లూటో అనే నౌకపై దాడి జరిగిందని భారత రక్షణశాఖ అధికారులు తెలిపారు. సౌదీ అరేబియా నుంచి మంగళూరుకు ముడిచమురుతో ఈ నౌక వస్తుందని, డ్రోన్ దాడితో మంటలు చెలరేగాయని పేర్కొన్నారు. దాడికి బాధ్యత వహిస్తున్నట్టు ఇప్పటి వరకు ఏ సంస్థ ప్రకటించలేదు.

తీరం చేర్చేందుకు చర్యలు

దాడి సమాచారంతో సాయం అందించేందుకు కోస్ట్‌గార్డు నౌక ఐసీజీఎస్ విక్రమ్‌ను ఘటనా స్థలికి పంపినట్టు రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. సమీప ప్రాంతాల్లోని అన్ని నౌకలను అలర్ట్ చేశామని తెలిపారు. మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ నౌక దెబ్బతిన్నదని వార్తా సంస్థ ఏఎన్ఐ నివేదించింది. భారత నౌకాదళ విమానం దాడికి గురైన నౌకను పరిశీలించి పెద్దగా ప్రమాదమేమీ లేదని తేల్చింది. నౌకను సురక్షితంగా తీరం చేర్చేందుకు కోస్ట్‌గార్డు గస్తీ నౌకలు బయలుదేరినట్టు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి.

హౌతీ తిరుగుబాటుదారుల పనా?

డ్రోన్ దాడికి బాధ్యత వహిస్తున్నట్టు ఇప్పటి వరకు ఎవరూ ప్రకటించలేదు. అయితే, గాజాపై ఇజ్రాయెల్ దాడిని నిరసిస్తూ హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్ నౌకలపై దాడులు చేస్తున్నారు. ఇది కూడా వాళ్ల పనే అయి ఉంటుందని అనుమానిస్తున్నారు. గత నెల హిందూ మహా సముద్రంలో ఇజ్రాయెల్‌కు చెందిన కార్గో నౌకపై అనుమానిత డ్రోన్ దాడి జరిగింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇది చేసిందని అమెరికా అధికారులు పేర్కొన్నారు.

డ్రోన్ దాడికి గురైన ఎంవీ కెమ్ ప్లూటో వాణిజ్య నౌక

ఎర్ర సముద్రంలో వరుస దాడులు

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం నేపథ్యంలో ఎర్ర సముద్రంలో హమాస్ మద్దతుదారుగా ఉన్న హౌతీలు నౌకలపై వరుసగా డ్రోన్, క్షిపణి దాడులు చేస్తున్నాయి. 35 వివిధ దేశాలకు సంబంధం ఉన్న 10 వాణిజ్య నౌకలను టార్గెట్‌గా చేసుకొని హౌతీలు 100కు పైగా డ్రోన్, క్షిపణి దాడులు చేశారని అమెరికా రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి.

గుజరాత్ గిఫ్ట్ సిటీలో మద్యపానానికి అనుమతి

బీజేపీ సర్కారుపై విపక్షాల ఆగ్రహం

అహ్మదాబాద్: 1960లో రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి మద్యనిషేధం అమల్లో ఉన్న గుజరాత్‌లో తొలిసారిగా గిఫ్ట్ సిటీలో మద్యం విక్రయాలకు అక్కడి బీజేపీ సర్కారు అనుమతినిచ్చింది. సిటీలోని హోటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బుల్లో మద్యం వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గిఫ్ట్ సిటీలో మద్య నిషేధాన్ని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్, ఆప్ దుయ్యబట్టాయి. ఇది యువతను నాశనం చేసే దురదృష్టకర నిర్ణయమని మండిపడ్డాయి. కాంగ్రెస్ నేత అమిత్ చావ్డా మాట్లాడుతూ, రాష్ట్రంలో మద్య నిషేధాన్ని ఎత్తివేయాలని బీజేపీ ప్రభుత్వం కోరుకుంటుందన్నారు. నేడు ఇది గిఫ్ట్ సిటీ నుంచి ప్రారంభమైందని, రేపు కేవడియాలోని సమైక్యతా విగ్రహం వద్దకు చేరుతుందని, ఆ తర్వాత సూరత్ డైమండ్ బౌర్సేలో కూడా పర్యాటకులను ఆకర్షించడం కోసమంటూ మద్య నిషేధాన్ని ఎత్తివేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రీనిచ్ నుంచి ఉజ్జయినికి

భోపాల్: ప్రపంచ కాలమాన ప్రమాణాన్ని (వరల్డ్ స్టాండర్డ్ టైమ్) ఇంగ్లండ్‌లోని గ్రీనిచ్ నుంచి మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి మార్చేందుకు కృషి చేస్తామని మధ్యప్రదేశ్ నూతన సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు. ప్రపంచ సమయాన్ని 300 ఏండ్ల క్రితమే భారత్ నిర్దేశించిందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం పారిస్ సమయాన్ని పొందడం ప్రారంభించిందని, ఆ తర్వాత బ్రిటిష్‌వారు ప్రపంచ ప్రామాణిక సమయాన్ని గ్రీనిచ్‌కు మార్చారని చెప్పారు. భూగోళ ఉత్తర, దక్షిణ ధృవాలకు సరిగ్గా మధ్యలో ఉన్న ప్రాంతాల్లో ఉజ్జయిని ప్రధానమైనదని నిరూపించడం ద్వారా ప్రపంచ సమయాన్ని సవరించేందుకు కసరత్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

ప్రాణాలకు తెగించి కాపాడాం.. కానీ!

- మా కృషికి, సాయానికి పొంతన లేదు
- కేవలం రూ.50 వేలు అందిస్తారా?
- ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రోత్సాహంపై ర్యాట్ హోల్ మైనర్స్ తీవ్ర అసంతృప్తి
- చెక్కులను వెనక్కి ఇచ్చేస్తామని వెల్లడి

డెహ్రాడూన్, డిసెంబర్ 23: ర్యాట్ హోల్ మైనర్స్.. గత నెల ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారా టన్నెల్ కూలిన ఘటనలో 41 మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. అత్యాధునిక యంత్రాలు విఫలమైన వేళ వీరు అత్యంత ప్రమాదకరమైన ర్యాట్ హోల్ మైనింగ్ విధానంలో మాన్యువల్ పద్ధతిలో చివరి 15 మీటర్లు టన్నెల్ శిథిలాలను తవ్వి కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారు. ఈ ఆపరేషన్‌లో అత్యంత కీలక పాత్ర పోషించిన ర్యాట్ హోల్ మైనర్స్ కృషిని మెచ్చుకుంటూ ఉత్తరాఖండ్ సీఎం గురువారం వారికి రూ.50 వేల చొప్పున చెక్ రూపంలో ప్రోత్సాహక నగదు అందించారు. అయితే దీనిపై ర్యాట్ హోల్ మైనర్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెస్క్యూ ఆపరేషన్‌లో తాము పోషించిన పాత్రకు, ప్రభుత్వ సాయానికి ఏ మాత్రం పొంతన లేదని అంటున్నారు. ఎలాంటి ముందస్తు షరతులు లేకుండా తమ ప్రాణాలను ఫణంగా పెట్టి మాన్యువల్‌గా డ్రిల్లింగ్ చేస్తూ టన్నెల్‌లో చిక్కుకొన్న కార్మికులను కాపాడామని పేర్కొన్నారు.

సీఎంకు అసంతృప్తి తెలియజేశాం

ప్రభుత్వం తమకు ఇచ్చిన నగదుతో ఏమాత్రం సంతృప్తిగా లేమని ర్యాట్ హోల్ మైనర్స్ బృందానికి నేతృత్వం వహించిన వకిల్ హసన్ తాజాగా ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పేర్కొన్నారు. చెక్కులు ఇచ్చిన రోజునే తమ అసంతృప్తిని సీఎంకు తెలియజేశామని, అయితే కొన్ని రోజుల్లో ప్రకటన చేస్తామన్న అధికారుల హామీ మేరకు తిరిగొచ్చామని పేర్కొన్నారు. హామీని నెరవేర్చకుంటే చెక్కులను తిరిగి ఇచ్చేస్తామని అన్నారు. రెస్క్యూ ఆపరేషన్‌లో సహకరించిన తమకు ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగాలు కల్పిస్తుందని ర్యాట్ హోల్ మైనర్స్ ఆశిస్తున్నారని చెప్పారు.

మృత్యువు నోటి గుండా వెళ్లాం

టన్నెల్‌లో చిక్కుకొన్న కార్మికులను కాపాడేందుకు తాము మృత్యువు నోటి గుండా ప్రవేశించామని, వారికి క్షేమంగా బయటకు తీసుకురావడం కోసం తమ కుటుంబ సభ్యుల మాట కూడా వినలేదని ఆపరేషనలో పాల్గొన్న మున్నా అనే ర్యాట్ హోల్ మైనర్ పేర్కొన్నారు. రూ.50 వేలు అనేది చాలా తక్కువ మొత్తమని అన్నారు.

ర్యాట్ హోల్ మైనర్లకు చెక్కులు అందిస్తున్న ఉత్తరాఖండ్ సీఎం

100 మందికి టికెట్ కట్!

- వరుసగా మూడోసారి అధికారమే లక్ష్యంగా బీజేపీ అధిష్ఠానం పావులు
- చాలా మంది సిట్టింగ్ ఎంపీలపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత
- పనితీరు సరిగాలేని, అధిక వయసు వంటి కారణాలతో నో టికెట్!
- జాబితాలో వరుణ్‌గాంధీ, మేనకా సహా పలువురు ప్రముఖ నేతలు?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ):మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత ఆయా ఆయా రాష్ట్రాల్లో సీఎంలుగా సీనియర్లను కాదని కొత్త ముఖాలను తెర ముందుకు తెచ్చిన బీజేపీ.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించినట్టు కనిపిస్తున్నది. వరుసగా మూడోసారి అధికారం చేపట్టేందుకు పావులు కదుపుతున్నది. ఇందు కోసం 2019 ఎన్నికల సమయంలో అనుసరించిన 'సిట్టింగ్ ఎంపీల స్థానాల్లో అభ్యర్థుల మార్పు' ఫార్ములానే ఈసారి కూడా ఫాలో అవ్వాలనే యోచనలో బీజేపీ అగ్రనాయకత్వం ఉన్నదని పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 99 మంది సిట్టింగుల స్థానంలో కొత్త వారికి టికెట్ ఇచ్చిన కమలం పార్టీ, వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూడా దాదాపు 100 స్థానాల్లో సిట్టింగ్‌లను మార్చనున్నట్టు తెలుస్తున్నది.

వారికే టికెట్లిస్తే ఆశలు వదులుకోవాల్సిందే..

వివిధ రాష్ట్రాలలో బీజేపీ ఎంపీల పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు అసోసియేషన్ ఆఫ్ బ్రిలియంట్ మైండ్స్(ఏబీఎం) అనే ఏజెన్సీ సర్వే నిర్వహించినట్టు తెలిసింది. ప్రాథమిక సర్వేలో దాదాపు 100 సిట్టింగ్ ఎంపీలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారని, తిరిగి వారికే టికెట్లిస్తే ఆ సీట్లపై ఆశలు వదులుకోవాలని అధిష్ఠానానికి నివేదిక సమర్పించిందని సమాచారం. ఈసారి టికెట్ గల్లంతయ్యే వారి లిస్టులో వరుణ్ గాంధీ, మేనకా గాంధీ లాంటి ప్రముఖులు కూడా ఉన్నారని తెలుస్తున్నది. 75 ఏండ్ల పైనున్న ఐదుగురు నేతలు, పదవీ విరమణ వయసు దాటిన మరో పది మందిని ఈసారి పక్కన పెట్టాలని బీజేపీ అధిష్ఠానం అలోచిస్తున్నదని విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరిలో మథుర ఎంపీ హేమమాలిని ఉన్నారు. అదేవిధంగా గుజరాత్‌లో 8 మంది, బీహార్, మహారాష్ట్రల్లో 10 మంది, మధ్యప్రదేశ్‌లో 11 మందికి టికెట్లు కట్ చేయాలన్న ఆలోచన బీజేపీ అధిష్ఠానానికి ఉందట.

2019లో కూడా ఇదే ప్లాన్

2019లో కూడా బీజేపీ అధిష్ఠానం చాలా మంది వృద్ధులైన సిట్టింగ్ ఎంపీలకు టికెట్లు ఇవ్వలేదని, అందులో ఎల్కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి, మాజీ సీఎం బీసీ ఖండూరీ, మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్ వంటి ప్రముఖులు కూడా ఉన్నారని పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి.

కోడి ఈకలతో గిన్నె

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: ఐఐటీ కాన్పూర్‌కు చెందిన ఇంక్యుబేట్ కంపెనీ 'నోవాఎర్త్'.. కోడి ఈకలతో గిన్నెను తయారుచేసింది. పర్యావరణానికి అత్యంత ముప్పుగా మారిన 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్'కు ప్రత్యామ్నాయంగా దీనిని రూపొందించినట్టు కంపెనీ తెలిపింది. నోవాఎర్త్ తయారుచేసిన పర్యావరణ హితమైన కోడి ఈకల గిన్నెకు పేటెంట్ హక్కులు కూడా దక్కటం విశేషం. సంస్థ వ్యవస్థాపకుడు సార్థక్ గుప్తా మాట్లాడుతూ, 'కోడి ఈకల నుంచి కెరాటిన్ అనే కంపోస్ట్‌ను తయారుచేశాం. ఈ పదార్థంతో గుండ్రటి గిన్నెను తయారుచేశాం. ఈ తరహా గిన్నెలతో పర్యావరణానికి ఎలాంటి హాని కలగదు' అని తెలిపారు.

ఒక మహిళ.. 2 గర్భాశయాలు.. కవలలు

అలబామా, డిసెంబర్ 23: ఒక మహిళకు రెండు గర్భాశయాలు ఉండటమే అరుదు. కొన్ని కోట్ల మందిలో ఒక మహిళకు ఇలాంటి అరుదైన పరిస్థితి ఉంటుంది. అయితే అమెరికాకు చెందిన ఓ మహిళ రెండు గర్భాశయాల ద్వారా రెండు వేర్వేరు రోజుల్లో కవలలకు జన్మనిచ్చింది. ఇది అత్యంత అరుదైన ఘటన అని వైద్యులు తెలిపారు. అలబామా రాష్ట్రానికి చెందిన కెల్సే హేచర్ (32) రెండు గర్భాశయాల ద్వారా డిసెంబర్ 19న ఉదయం ఒకరికి, డిసెంబర్ 20న ఉదయం మరొకరికి జన్మనిచ్చినట్టు వైద్యులు వెల్లడించారు. ఇద్దరూ ఆడశిశువులే కావటం, వారి ఇంట క్రిస్మస్ పండుగ ఆనందాన్ని మరింత రెట్టింపు చేసింది. హేచర్ రెండు రోజుల వ్యవధిలో రెండు గర్భాశయాల ద్వారా ఇద్దరు పిల్లలకు జన్మనివ్వటంపై వైద్యులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భాలు 5 కోట్ల మందిలో ఒకరికి జరుగుతూ ఉంటాయని ఆమెకు పురుడు పోసిన గైనకాలజిస్ట్ శ్వేతా పటేల్ తెలిపారు. రెండు గర్భాశయాలున్నా.. జననాలు సక్సెస్ అయ్యే అవకాశం చాలా తక్కువ. అయితే ఈ కేసులో ఇద్దరూ ఆరోగ్యంగా పుట్టారని వైద్యులు చెప్పారు. తనకు రెండు గర్భాశయాలు ఉన్నాయన్న సంగతి కెల్సే హేచర్‌కు 17వ ఏట తెలిసిందట. 2019లో బంగ్లాదేశ్‌లోనూ ఓ మహిళ ఇలాగే 26 రోజుల వ్యవధిలో ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చిందని వైద్యులు పేర్కొన్నారు.



బరువును తగ్గించే క్యాప్సుల్

న్యూయార్క్, డిసెంబర్ 23: పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతుంటే ఏమీ చేయలేని పరిస్థితి. వ్యాయామం చేద్దామంటే ఒళ్లు బద్ధకం, చేద్దామన్నా టైం సరిపోక బరువు పెరిగిపోతాం. ఈ గోల లేకుండా ఓ మాత్ర వేసుకుంటే చాలు.. ఆటోమెటిక్‌గా బరువు తగ్గొచ్చుట. అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్రియా శ్రీనివాసన్ బృందం ఈ వైబ్రేటింగ్ క్యాప్సుల్‌ను తయారుచేసింది. తినటానికి 20 నిమిషాల ముందు ఈ క్యాప్సుల్ వేసుకుంటే కడుపు నిండుగా ఉందన్న ఫీలింగ్ కలిగి, తక్కువగా తినటానికి ఆస్కారం ఉంటుందని పరిశోధకులు వెల్లడించారు.

కళ్యాణమస్తు

..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో

రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
Konala Bhagyalakshmi Reddy, M.A.
President: Telangana Marriage Links.
H.O.: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O.: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439

బ్రాహ్మిణ్స్ స్పెషల్

వధువు కావలెను

★బ్రాహ్మిణ్స్:27 Yrs, 5'8", B.Tech SWE, Hyd, 18 Lakhs P/A, Well Settled వరుడికి తగిన వధువు కావలెను. 9030315599

★బ్రాహ్మిణ్స్:30 Yrs, 5'8", M.E, Ph.D, SWE, Hyd, 15 Lakhs P/A వరుడికి తగిన వధువు కావలెను. 9248064777

★బ్రాహ్మిణ్స్:31 Yrs, 5'10", M.Tech SWE, Hyd, 11 Lakhs P/A (Only Son) గల Well Settled వరుడికి తగిన వధువు కావలెను. 7207930999

★బ్రాహ్మిణ్స్:28 Yrs, 5'9", B.Tech MS, SWE, USA, 120K P/A, Well Settled వరుడికి తగిన వధువు కావలెను. 9701960229

★బ్రాహ్మిణ్స్:34 Yrs, 5'9", MS (Pharma) Sr. Scientific Writer, Hyd, 22 Lakhs P/A వరుడికి తగిన వధువు కావలెను. 9246960888

★బ్రాహ్మిణ్స్:28 Yrs, 5'11", MBBS, MD, Doctor వరుడికి తగిన వధువు కావలెను. 9248064777

★బ్రాహ్మిణ్స్:36 Yrs, 5'11", B.Tech, M.S., Asst. Manager, 90,000 P/M వరుడికి తగిన వధువు కావలెను. 7207930999

★బ్రాహ్మిణ్స్:27 Yrs, 5'8", B.Tech, SWE, Hyd, 25 Lakhs P/A, వరుడికి తగి